సాక్షి
నిర్మల్
మంగళవారం : 6 : ఫిబ్రవరి : 2024



ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు..
నాగోబా జాతరలో భాగంగా మహాపూజకు అవసరమయ్యే గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు ఇంద్రాదేవి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. 8లో▸



సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలి
పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సమాచారం పరస్పరం షేర్ చేసుకోవాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34.2 / 21.2
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. పగలు వేగిగా ఉంటుంది. రాత్రి చలి తగ్గుముఖం పడుతుంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల ఫస్ట్ లెవెల్ తనిఖీ



ఈవీఎంల తనిఖీలో కలెక్టర్, నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి విడత తనిఖీని కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 14వ తేదీ వరకు మొదటి విడత చెకింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ఈవీఎం గోదాంకు తరలించామని తెలిపారు. సీయూ, బీయూలు, వీవీప్యాట్స్‌ను చెక్ చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గాజుల రవి, శ్రావణ్‌రెడ్డి, మజార్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 126 మంది స్టాఫ్‌నర్సులు



రిపోర్ట్ చేస్తున్న స్టాఫ్ నర్సులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో స్టాఫ్‌నర్స్‌గా ఎంపికై కౌన్సిలింగ్‌లో నిర్మల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రుల్లో పోస్టింగ్ వచ్చిన వారు సోమవారం విధుల్లో చేరారు. మెడికల్ కాలేజీకి 203 స్టాఫ్‌నర్సులను కేటాయించగా, ఇప్పటి వరకు 160 మంది రిపోర్ట్ చేశారని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ తెలిపారు. 34 మంది స్టాఫ్ నర్సులు రెండు మూడు రోజుల్లో రిపోర్ట్ చేస్తారన్నారు. విధుల్లో చేరిన స్టాఫ్‌నర్సులందరికీ విధులు కేటాయిస్తామన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలతోపాటు మండలంలోని మస్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలను డీఈవో రవీందర్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. పది ఫలితాల్లో మొదటిస్థానంలో నిలిచేలా విద్యార్థులు కష్టపడాలని సూచించారు. ఉపాధ్యాయులు సైతం ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని తెలిపారు. డీఈవో వెంట హెచ్‌ఎంలు నరేందర్‌రెడ్డి, సంధ్యారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

7న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నిర్మల్ రూరల్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న జిల్లా కేంద్రంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభగౌడ్, శామ్యూల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్ 8, 10 ,12, 14 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా రన్నింగ్, జంపింగ్ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. విజేతలను ఈనెల 10న భద్రాది కొత్తగూడెం జిల్లాలో నిర్వహించే 8వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో 7వ తేదీ ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9440516634 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'హామీలు ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం కుట్ర'

లక్ష్మణచాంద: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీజేపీ జిల్లా నాయకుడు రావుల రాంనాథ్ ఆరోపించారు. గావ్ చలో అభియాన్‌లో భాగంగా మండలంలోని వడ్యాల్ గ్రామంలోని సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. రెండు గ్యారంటీలతోనే కాలం గడపుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ అడ్డుపెట్టుకుని గ్యారంటీలను అమలు చేయకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం కుమ్మక్కయ్యాయని తెలిపారు. కార్యకర్తలు బీజేపీ కార్యక్రమాలను గ్రామ గ్రామాన ప్రచారం చేసి ఆదిలాబాద్ లోక్‌సభలో స్థానంలో బీజేపీ గెలిచేలా కృషి చేయాలని సూచించారు.

పదికి ప్రత్యేక ప్లాన్!



కేజీబీవీ పాఠశాలలో పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థినులు

- పరీక్షల నిర్వహణ, సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష
- 45 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికకు ఆదేశం
- విద్యార్థులకు ప్రారంభమైన ప్రత్యేక పరీక్షలు

భైంసాటౌన్: పదో తరగతి ఫలితాల్లో జిల్లాను ఈ ఏడాది కూడా అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రత్యేక దృష్టి సారించారు. గత విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ స్థానం 'పది'లంగా నిలిపేలా కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణ, సన్నద్ధతపై అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతేడాది తరహాలో ఉత్తమ ఫలితాల సాధనకు 45 రోజులపాటు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. ఇందుకు పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా ప్రత్యేక తరగతుల నిర్వహణతోపాటు విద్యార్థులు వందశాతం హాజరయ్యేలా చూడడం, ఉపాధ్యాయులు ప్రతీరోజు స్లిప్ టెస్ట్‌లు నిర్వహించడం, అదేరోజు మూల్యాంకనం చేసి ఆయా పాఠ్యాంశాల్లో సందేహాలు నివృత్తి చేస్తూ వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ఇందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్లాలన్నారు.

ఈసారి ప్రత్యేక పరీక్షలు...
ఏటా పదో తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఏ-1, 2, 3, 4 పరీక్షలతోపాటు ఎస్‌ఏ-1 ఆ తరువాత ప్రిఫైనల్ పరీక్షలు నిర్వహించేవారు. ఈసారి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలపై దృష్టి పెట్టిన కలెక్టర్ ఎస్‌ఏ-2 తరహాలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఇందులో భాగంగా ఈనెల 5 నుంచి 12 వరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఒకే సమయంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే డీసీఈబీ ద్వారా ప్రశ్నపత్రాలు పాఠశాలలకు పంపించారు. తద్వారా వార్షిక పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతను అంచనా వేయవచ్చు. మార్చి మొదటివారంలో నిర్వహించే ప్రిఫైనల్ పరీక్షకు ముందుగానే జిల్లాస్థాయిలో మరో రెండు ప్రిఫైనల్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. తద్వారా విద్యార్థులను పూర్తిస్థాయిలో పరీక్షలకు సన్నద్ధం చేసేలా కార్యాచరణ రూపొందించారు.

జిల్లాలో పదో తరగతి విద్యార్థుల వివరాలిలా...

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ	08	346
ఎంపీపీ,జెడ్పీఎస్‌ఎస్	108	3255
కేజీబీవీ	18	734
మైనార్టీ వెల్ఫేర్	05	223
ఎంజేపీ	06	428
మోడల్‌స్కూల్	01	100
టీఎస్ ఎస్‌డబ్ల్యూఆర్‌ఐ	05	391
టీఎస్ డబ్ల్యూఆర్‌ఐ	01	84
టీఎస్‌ఆర్‌ఈఐ	01	79
ఆశ్రమ పాఠశాలలు	13	410
ప్రైవేట్ పాఠశాలలు	105	2,873
మొత్తం	271	8,923

ప్రత్యేక దృష్టి సారించాం..
పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు 45 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. నేటి నుంచి ఎస్‌ఏ-2 తరహాలో పూర్తయిన రెండో సగం సిలబస్‌పై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఒకే సమయంలో పరీక్షలు నిర్వహించనున్నాం. ఇప్పటికే ప్రశ్నపత్రాలు పాఠశాలలకు అందించాం.
– పద్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, నిర్మల్

వందశాతం ఫలితాలకు..
గతేడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ విద్యాసంవత్సరం కూడా జిల్లాను ముందంజలో నిలిపేలా కృషి చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు కార్యాచరణ రూపొందించాం. ప్రత్యేక పరీక్షలు, రోజువారీ స్లిప్ టెస్ట్‌లు, ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తాం. వందశాతం ఉత్తీర్ణతకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.
– రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

ఖానాపూర్ 'హస్త'గతం



సమావేశం అనంతరం విజయ సంకేతం చూపుతున్న చిన్నం సత్యం, కౌన్సిలర్లు

- మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం
- పదవులు కోల్పోయిన బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపూర్: ఏడాదిగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఖానాపూర్ మున్సిపల్ అవిశ్వాస ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం పూర్తయింది. మున్సిపల్ ఛైర్మన్ అంకం రాజేందర్, వైస్‌ఛైర్మన్ అబ్దుల్ కలీల్‌పై బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెందిన 9 మంది కౌన్సిలర్లు ఏడాది క్రితం అవిశ్వాసం ప్రకటించారు. కలెక్టర్‌కు సంతకాలతో నోటీసులు ఇచ్చారు. ఖానాపూర్‌లో కుంటుపడుతున్న అభివృద్ధితోపాటు అవినీతి అక్రమాలను రూపుమాపాలని పార్టీలకు అతీతంగా అవిశ్వాసం పెట్టినట్లు తెలిపారు. మొదట్లో రాష్ట్రవ్యాప్తంగా అవిశ్వాసంపై కోర్టు స్టే ఉండడంతో ప్రక్రియ ముందుకు సాగలేదు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రెండోసారి అవిశ్వాసానికి నోటీలు ఇచ్చినా ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో వాయిదా పడింది. ముచ్చటగా మూడోసారి జనవరి 9న కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. దీంతో సోమవారం అవిశ్వాసంపై సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు కౌన్సిలర్లకు నోటీసులు అందించారు.

అవిశ్వాసానికి అనుకూలంగా తీర్పు
ఈ క్రమంలో కోర్టులో ఉన్న స్టేపై తీర్పు అవిశ్వాసానికి అనుకూలంగా రావడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగేందుకు మార్గం సుగమమైంది. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు ప్రిసైడింగ్ అధికారి రత్నకల్యాణితోపాటు 9మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ ఛైర్మన్‌పై జరిగిన అవిశ్వాస ప్రక్రియలో 9 మంది కౌన్సిలర్లు మూజువాణి ఓటుతో సమ్మతి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు వైస్‌ఛైర్మన్‌పై సైతం 9మంది కౌన్సిలర్లు మూజువాణి ఓటుతో అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో ఇద్దరిపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఈ ప్రక్రియను పూర్తిగా ఉన్నతాధికారులతోపాటు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తదుపరి ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు.



అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లు

అవినీతిపై విజయం..
నాలుగేళ్లుగా కుంటుపడిన ఖానాపూర్‌ను అభివృద్ధి చేయడంతోపాటు మున్సిపల్‌లో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలను వెలికితీసేందుకు పెట్టిన అవిశ్వాస ప్రక్రియలో ఎట్టకేలకు న్యాయమే గెలిచిందని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం అన్నారు. అవిశ్వాస ప్రక్రియ నెగ్గిన అనంతరం మాట్లాడారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సహకారంతో ఖానాపూర్ పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు. అవిశ్వాసానికి ఎన్ని అడ్డంకులు సృష్టించినా చివరకు న్యాయమే గెలిచిందని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా తనకు సహకరించిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పరిమిలత, ఆఫ్రినాబేగం, నాయిని స్రవంతి, ఫౌజియా, కిశోర్‌నాయక్, కావలి సంతోష్, జన్నారపు విజయలక్ష్మి, తొంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వాణి' విన్నారు..

- ప్రజావాణికి 47 దరఖాస్తులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

నిర్మల్‌టౌన్: జిల్లా నలుమూలల నుంచి నమ్మకంతో కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజల వాణిని.. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ విన్నారు. అర్జీలను స్వీకరించారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాప్యం అయితే అందుకు కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 47 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ స్వయంగా స్వీకరించి ఓపికగా సమస్యలు తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని, పరిష్కారం ఏ దశలో ఉందో కూడా ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పెన్షన్లు, భూసమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి.

- ఆర్డీవో కార్యాలయం ఎదుట పోలీసులు రోడ్డును మూసివేయడంతో అక్కడి నుంచి ఈద్గాం, మున్సిపల్, కోర్టుకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని నిర్మల్ పట్టణంలోని 41వ వార్డుకు చెందిన కాలనీవాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ తాండాకు చెందిన అరుగురుకి సంబంధించిన 4.03 గుంటల భూమిలో సగానికిపైగా అటవీ భూమి ఉందని, అధికారులు ఫెన్సింగ్ చేశారు. మొక్కలు నాటారు. తమ భూమి తమకు ఇప్పించాలని బాధితులు కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు.
- కుంటాల మండలం ఓలా గ్రామానికి చెందిన జాదవ్ గంగాధర్ తన 8 ఎకరాల సొంత భూమిని కొందరు స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తాను సాగుచేస్తున్న పంటలను ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నాడు. వారిపై చర్య తీసుకోవాలని కోరాడ.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సమస్యలను నా దృష్టికి తీసుకురండి

- ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ముధోల్ ఎమ్మెల్యే సూచన
- కళాశాలను సందర్శించిన రామారావు పటేల్
- విద్యార్థులతో మాటామంతి

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచించారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులు ఉండే వసతి గృహాలను పరిశీలించారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు ఎలా ఉన్నాయో తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, భయపడొద్దని ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో విద్య, వైద్యంపై తాను ప్రత్యేక దృష్టిసారించానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించే గదికి వెళ్లారు. అక్కడి వసతులపై ఆరాతీశారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రామారావుపటేల్

12న నులిపురుగుల నివారణ దినం

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వయసుగల వారు 1,91,713 మంది ఉన్నట్లు తెలిపారు. 1 నుంచి 2 సంవత్సరాల వయసున్న పిల్లలకు 200 ఎంజీ (సగంమాత్ర), 2 నుంచి 9 సంవత్సరాల వయసున్న పిల్లలకు 400 ఎంజీ(ఒక మాత్ర) చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ మాత్రలను ప్రతీ పాఠశాల, కళాశాలలో మధ్యాహ్నం భోజనం తర్వాత అందించాలని సూచించారు. 12న మాత్రలు వేసుకోని వారికి 19న అందించాలని తెలిపారు. 12న జాతీయ నులిపురుగుల దినం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు 'ప్రత్యేక' గ్రామసభలు

నిర్మల్‌చైన్‌గేట్: పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసినందున నూతనంగా బాధ్యతలు చేట్టిన ప్రత్యేక అధికారులు మంగళవారం ప్రతీ గ్రామంలో సభలు నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సమీకృత కలెక్టరేట్‌లో పంచాయతీ ప్రత్యేక అధికారులకు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలసి సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచులకు ఉన్న అన్ని అధికారాలు, బాధ్యతలు ప్రత్యేక గ్రామ పంచాయతీ అధికారులకు ఉంటాయని తెలిపారు. కొత్త పంచాయతీరాజ్ చట్టంలోని అంశాలను అధికారులు తెలుసుకోవాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్లపై చెత్తను తొలగించి, ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించి ఒక్కో ఇంటికి ఎన్ని లీటర్ల నీరు అందించేది నమోదు చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వందశాతం పన్నులు వసూలు చేయాలని తెలిపారు. ప్రజలను గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని సూచించారు. పంచాయతీ బడ్జెట్‌లో 10 శాతం పచ్చదనానికి కేటాయించాలని సూచించారు. స్థానిక వనరులతో ఆదాయం పెంచుకోవాలని తెలిపారు. ఈ నెల 7 నుంచి 14 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా కూడా 7న గ్రామ సభ నిర్వహించాలన్నారు. 15న గ్రామ సభ నిర్వహించి గ్రామంలో ఉన్న సమస్యపై అవగాహన, చర్చ జరపాలని తెలిపారు. కార్యక్రమంలో సీఈవో సుధీర్, డీపీవో శ్రీలత, డీఆర్డీవో విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు

బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్

లక్ష్మణచాంద: బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు సోమవారం చేపట్టారు. ప్రభుత్వం మూడు డీఏలు, పీఆర్సీ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలన్నారు. కేజీబీవీ టీచర్లకు ఎంటీఎస్ ప్రకటించాలని కోరారు. 317 బాధితులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్, అశోక్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, బలరామ్, రాందాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో మాట్లాడుతున్న వెంకట్

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: సంప్రదాయ ఉత్పత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తక్కువ వడ్డీతో రుణం అందించే పీఎం విశ్వకర్మ పథకాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో పీఎం విశ్వకర్మ జాయింట్ కమిటీ మీటింగ్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం విశ్వకర్మ పథకం గురించి చిన్న తరహా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నరసింహారెడ్డి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ స్కీంకు 18 రకాల చేతివృత్తుల వారు అర్హులని తెలిపారు. 18 ఏళ్లు పైబడినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదట గ్రామ పంచాయతీ సెక్రటరీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్కడి నుంచి జిల్లా కమిటీ స్క్రూటిని తర్వాత రాష్ట్ర కమిటీకి పంపడం జరుగుతుందని తెలిపారు. స్టేట్ లెవెల్ కమిటీ అర్హులను గుర్తించి పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డు అందిస్తుందని పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మకు ఎంపికైన వారికి బ్యాంకు నుంచి మొదటి విడత రుణం రూ.లక్ష తీసుకుని 18 నెలలలో ఐదు శాతం వడ్డీతో చెల్లించాలన్నారు. రెండో విడతలో రూ.2 లక్షల రుణాన్ని 30 నెలలలో చెల్లించాలని తెలిపారు. జెడ్పీ సీఈవో, డీఆర్డీవో అధికారులు అర్హులను గుర్తించి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పీఎం విశ్వకర్మ పథకం గురించి వివరిస్తున్న చిన్న తరహా పరిశ్రమల శాఖ అధికారి నరసింహారెడ్డి

మాక్‌డ్రిల్‌తో ఆత్మవిశ్వాసం

నిర్మల్‌చైన్‌గేట్: హఠాత్తుగా మంటలు అంటుకుని ప్రమాదాలు.. ప్రకృతి విపత్తులు.. సంభవించినప్పుడు ఎలా బయటపడాలో ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ బృందం కలెక్టరేట్‌లో కళ్లకు కట్టినట్లు సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించింది. విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా రక్షించుకోవాలో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ నంది అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ మాక్‌డ్రిల్‌తో ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, పరిశ్రమలు, కర్మాగారా లు, భూగర్భ గనుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలను రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ తక్షణమే స్పందించి సేవలు అందిస్తోందన్నా రు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని గోపాల్ నగర్‌లో గల ఓ ఇంట్లో పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడిచేసి ఫారెస్ట్ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో గుట్టుగా జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.70,230 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక బీఫ్ మార్కెట్ వద్ద మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ చేయగా సయ్యద్ జాబీర్ అనే వ్యక్తి సాయంతో ఓవైసీనగర్‌కు చెందిన కాంపల్లి రాజు మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు రాజును అదుపులోకి తీసుకుని, అతని వద్ద రూ.2,840 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సయ్యద్ జాబీర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.



ఇంద్రాదేవికి మొక్కుతున్న మెస్రం వంశీయులు



మర్రిచెట్టు వద్ద గంగాజలం భద్రపరుస్తున్న మెస్రం పెద్దలు



నైవేద్యాలు తయారు చేస్తున్న మెస్రం ఆడపడుచులు



కేస్లాపూర్ మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయులు

ఇంద్రాదేవికి 'మెస్రం' పూజలు..

- అనంతరం కేస్లాపూర్‌కు పయనం
- మర్రిచెట్టు వద్ద బస

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా మహాపూజకు అవసరమయ్యే గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు పాదయాత్రగా సోమవారం ఇంద్రవెల్లికి చేరుకున్నారు. ఇంద్రాదేవి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర గంగాజలాన్ని ఆలయం ఎదుట ఉన్న మర్రి చెట్టుపై భద్రపరిచారు. వీరి రాక నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 22 కితల మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లతో ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. రాత్రి కేస్లాపూర్ సమీపంలోని మర్రి చెట్టు వద్దకు చేరి అక్కడే బస చేశారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు సంప్రదాయ పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రధాన్ కితకు చెందిన దాదారావ్ ఆధ్వర్యంలో నాగోబా చరిత్ర బోధిస్తారు. ఈ నెల 9న రాత్రి 10:30 గంటలకు మహాపూజ అనంతరం జాతర ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి వెంకటరావ్ తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశపెద్దలు కోసు కటోడా, కోసేరావ్, దాదారావ్, హనుమంత్ రావ్, తిరుపతి తదితరులున్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్యపరీక్షలు



పరీక్షల కోసం హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: కానిస్టేబుల్ అభ్యర్థులకు రిమ్స్ ఆస్పత్రిలో సోమవారం మెడికల్ టెస్ట్ (వైద్య పరీక్షలు) నిర్వహించారు. ఈ ప్రక్రియను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో పాటు నోడల్ అధికారి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పరిశీలించారు. నాలుగు బృందాలను ఏర్పాటు చేయగా ఒక్కో బృందానికి రోజుకు 20 చొప్పున 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 362 మంది అభ్యర్థులకు ఈ పరీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు. కంటి పరీక్షలతో పాటు అన్నిరకాల పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని తెలిపారు.

'మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం'



మాట్లాడుతున్న గీతారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలకు రక్షణ కల్పించడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతారెడ్డి ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మహేశ్వర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇతర మోర్చాలతో సమానంగా బీజేపీ మహిళా మోర్చా పనిచేస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్‌కు గాయాలు

ఖానాపూర్: రోడ్డు ప్రమాదంలో మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ రామకృష్ణకు గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి ఖానాపూర్ నుంచి సింగాపూర్ గ్రామానికి వెళ్తుండగా ఖానాపూర్-నిర్మల్ ప్రధాన రహదారిపై ఎక్బాల్‌పూర్ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. నార్నూర్ మండలం జాండా గ్రామానికి చెందిన ఆత్రం అమృత వైద్య చికిత్సకు ఆర్థికసాయం అందించాలని, ఉట్నూర్‌కు చెందిన సెడ్మకి సంధ్య కుట్టు మిషన్ అందించాలని, జైనూర్ మండలం పానాపతార్ గ్రామస్తులు ఇండ్లు మంజూరు చేయించాలని, జైనూర్ మండలం దబోలి గ్రామానికి చెందిన సిడాం ముత్తా ఆయిల్ ఇంజన్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఈఈ భీంరావు, ఏఓ రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

రిమ్స్ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు

ఎదులాపురం: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఆధ్వర్యంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సమ్మె నోటీసును అందించారు. రిమ్స్‌లో పని చేస్తున్న కార్మికులందరూ ఈనెల 16 కార్మిక, రైతు సంఘాలు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌లో పాల్గొంటారని, వారందరికీ సహకరించాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు కూడా సమ్మెలో భాగస్వాములు కావాలన్నారు. పరిశ్రామిక వివాదాల చట్టం 1947సెక్షన్ -22, సబ్ సెక్షన్ (1) అనుసరించి ఈ సమ్మె నోటీసు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా కమిటీ సభ్యులు పి.పోచన్న, ఆర్.సురేందర్, నాయకులు నరేశ్, ఇమ్రాన్ ఆలీ, దశాంత్, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న అన్నమొల్ల కిరణ్

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

కడెం: గత నెల 31న అదృశ్యమైన మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికుడి మృతదేహం సోమవారం కడెం ప్రాజెక్టులో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మధ్యప్రదేశ్‌లోని బాలఘట్ జిల్లా లాల్‌బురా తాలుకా బడ్‌గావ్ గ్రామానికి చెందిన గౌతం దేవేంద్ర (30) ఏపీకి చెందిన మరి కొందరు కార్మికులతో కలిసి కొద్ది రోజులుగా కడెం ప్రాజెక్ట్ దిగువన డ్రిల్లింగ్ పనులు చేస్తున్నాడు. గత నెల 31న రాత్రి ప్రాజెక్ట్ వద్ద వారు ఉంటున్న రూం నుంచి బయటకు వెళ్లాడు. తోటి కార్మికులు ఉదయం చూసేసరికి దేవేంద్ర కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 2న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రాజెక్ట్‌లో మృతదేహం బయటకు తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ మోహన్, ఇన్‌చార్జి ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

భైంసాలో ఇద్దరి ఆత్మహత్య



శంకర్ (ఫైల్)



ఆహద్ (ఫైల్)

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఒకరు, ఇంట్లో ఉరేసుకుని మరొకరు సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఆమోస్ తెలిపారు. కుంట ప్రాంతానికి చెందిన ఆహద్ (30) స్థానికంగా లేబర్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య డబ్బు విషయమై గొడవ కారణంగా ఇంటి నుంచి వెళ్లి గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని వెలికితీయించే పనిలో ఉన్నారు. మార్వాడిగల్లికి చెందిన శంకర్ (30) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(జి) 61వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చాకటి వర్ధన్, సతీష్ ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా భైంసా వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీ కొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పెందూర్ రమేశ్ అదృశ్యమైనట్లు అతని భార్య పెందూర్ అనిత టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 25న ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడని, అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం గాలించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్‌లో సోమవారం పిచ్చికుక్క పలువురిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన రిక్కల సుదర్శన్, బక్కి మమతకు, బక్కి శ్రీకాంత్‌ను గాయపర్చింది. రొడ్డ గంగా ప్రసాద్‌ను వెంబడించగా పరిగెత్తే క్రమంలో అతని కాలు విరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కుంటాల, భైంసా ఆస్పత్రులకు తరలించారు. బక్కి సాయినాథ్, దొంతుల మల్లేష్ ఎడ్లపై కూడా పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి.

కుంటాలలో స్వైర విహారం...

మండల కేంద్రంలో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఆరోతరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థి గణేశ్, ఆటో దశరథ్ ,పోస్ట్ హైమద్, కటికే వంశీలపై దాడి చేసి గాయపరిచింది. గ్రామస్తులు వెంబడించి కుక్కను హతమార్చారు. ఆదివారం రాత్రి అందాకూర్‌లో పలువురిపై దాడిచేయడంతో గాయాలైనట్లు తెలిసింది.



గాయపడిన హైమద్

సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జానకి షర్మిల
- నాందేడ్‌లో తెలంగాణ, మహారాష్ట్ర పోలీసు అధికారుల సమావేశం

నిర్మల్‌టౌన్: పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సమాచారం పరస్పరం షేర్ చేసుకోవాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో నాందేడ్ రేంజ్ డీఐజీ శశికాంత్ మహావర్కర్ నాందేడ్‌లో సోమవారం బార్డర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రెండు నెలల ముందు నుంచే సరిహద్దు పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అక్రమంగా తరలించే మద్యం , నగదును అడ్డుకోవాలని సూచించారు. సరిహద్దు గుండా అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శనం చేసేందుకు మూడు అంచెల్లో అధికారులకు బాధ్యతలను అప్పగించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచార వ్యవస్థను పరస్పర మార్పిడి చేసుకోవడంతోనే ఎన్నికలను సజావుగా ముగించవచ్చని చెప్పారు. ఎన్నికలలో ధనం, మద్యం పాత్ర విశేషంగా ఉంటుందని వాటిని అరికట్టడానికి ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు ఇప్పటినుండి సంసిద్ధంగా ఉండాలన్నారు.
మావోయిస్టులను జిల్లాలోనికి రానివ్వకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం కూంబింగ్ చేస్తూ బహుముఖ వ్యూహం రచించాలని పిలుపునిచ్చారు. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణ పోలీసులు ప్రస్తుతం వినియోగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సింగినవార్, నాందేడ్ ఎస్పీ శ్రీకృష్ణ కొకటే, కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ, ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం, బీదర్ ఎస్పీ చెన్నా బసవన్న, అదనపు ఎస్పీ నాందేడ్ అభినాష్ కుమార్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, బోర్డర్ పోలీస్ స్టేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల

ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా



బోల్తా పడిన ఆర్టీసీ బస్సు



బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

- డ్రైవర్‌తో సహా ఐదుగురికి గాయాలు

తాంసి: మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన తలమడుగు మండలంలోని చర్లపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రం నుంచి టీఎస్‌ఆర్టీసీ చెందిన టీఎస్ 01యూసీ 6541 బస్సు ప్రయాణికులను తీసుకోని ఝరి పూనగూడ వెళ్తుండగా చర్లపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురితో పాటు డ్రైవర్ అజయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మరో పది నిమిషాల్లో బస్సు దిగి ఇంటికి చేరుకునే సమయంలో ఇలాంటి ఘటన జరుగడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. తలమడుగు ఏఎస్సై సురేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన ఆర్టీసీ బస్సు డ్రైవర్


సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎం....

ఆర్టీసీ డీఎం కల్పన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గాయాలైన వారి వివరాలు సేకరించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధితులను తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి పరామర్శించారు.

ఆ ఉపాధ్యాయుడికి మరోచోట పోస్టింగ్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ సస్పెన్షన్‌కు గురై ఇటీవల మళ్లీ అదే పాఠశాలలో విధుల్లో చేరిన ఉపాధ్యాయుడిని మరో చోటికి బదిలీ చేశారు. ఈ మేరకు డీఈవో ప్రణీత సోమవారం నేరడిగొండ ఉన్నత పాఠశాల నుంచి ఉట్నూర్ మండల కేంద్రంలోని యూపీఎస్ పాఠశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఉపాధ్యాయుడిని నేరడిగొండ పాఠశాలకు కేటాయించకపోవడంతో విద్యార్థులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు లేకపోవడంతో తమకు చదువు పరంగా ఇబ్బందులు ఎదురవుతాయని, మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతను వివరణ కోరగా మండలంలో సర్దుబాటు చేసేందుకు చర్యలు చేపట్టగా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆ ఉపాధ్యాయుడిని తమ గ్రామంలోని పాఠశాలకు కేటాయించవద్దని పేర్కొనడంతో ఉట్నూర్‌లోని యూపీఎస్ పాఠశాలకు పంపించినట్లు పేర్కొన్నారు. నేరడిగొండ పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని వివరించారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి



కదిరి ఆశన్న (ఫైల్)

తాంసి: తలమడుగు మండలంలోని డోర్లి శివారులో రైలు ఢీకొన్న ఘటనలో పిప్పల్‌కోటికి చెందిన కదిరి ఆశన్న (72) మృతి చెందాడు. మృతుడు తలమడుగు మండలంలోని ఝరిలో ఉంటున్న కూతురు ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో డోర్లి గ్రామ సమీపంలో రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వృద్ధుడికి సరిగ్గా చెవులు వినిపించవని, కళ్లు సైతం సరిగా కనిపించవని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అమ్మవారికి చేనేత పట్టుచీర



చీర నేస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు



ఆలయంలో పూజలు చేస్తున్న అందెశ్రీ

- మగ్గంపై నేస్తున్న పద్మశాలీ సభ్యులు

భైంసా(ముధోల్): వసంత పంచమికి సరస్వతీ అమ్మవారికి సమర్పించేందుకు బాసరకు చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు చేనేత పట్టుచీరను సమర్పించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం సంఘ భవనంలో పూజలు చేసి చేనేత పనులు ప్రారంభించారు. మగ్గంపైనే పట్టుచీరను తయారుచేసి అమ్మవారికి సమర్పిస్తున్నారు. అమ్మవారికి పద్మశాలీ అన్నసత్రం నుంచి ఏటా చేనేత చీర సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నట్లు సత్రం అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షులు స్వామి, శ్రీశైలం అధ్యక్షులు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న అందెశ్రీ

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ప్రముఖ గేయ రచయిత అందెశ్రీ సోమవారం దర్శించుకున్నారు. జయజయహే తెలంగాణ అనే పాట తాను రాశానని అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్రీయ గీతంగా ఈ పాటను ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఆలయ వైదిక బృందం అమ్మవారి ఆశీస్సులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బాసర ఆలయంలో వేలం పాట

భైంసా: బాసర గోదావరి తీరంలో గల ఆలయ అనుబంధ దేవాలయం వికలేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూమిలో సోమవారం వేలం పాట నిర్వహించారు. బహిరంగవేలం పాటలో సర్వేనంబర్ 438లో గల హోటల్‌తోపాటు మరోషాపునకు బహిరంగవేలం నిర్వహించారు. సీల్డ్ టెండర్‌లో హెచ్చుపాట శాఖాహార హోటల్‌కు రూ.18లక్షల 25 వేలు, మరో షాపు నిర్వాహణకు రూ.16 లక్షల వేయి వచ్చినట్లు ఆలయ ఈఓ విజయరామారావు తెలిపారు. ఏడాది కాలపరిమితికి వేలం పాట నిర్వహించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- పాఠశాల ఎదుట ఏబీవీపీ ఆందోళన

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు అకారణంగా చితకబాదాడని ఆరోపిస్తూ సోమవారం పాఠశాల ఎదుట ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కేతన్‌ను సోమవారం ఉపాధ్యాయుడు కొట్టడంతో తలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు పాఠశాలకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పాఠశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థిని దండించిన ఉపాధ్యాయునిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘు, నగర కార్యదర్శి అఖిల్, నాయకులు శశాంక్, శ్రీనీత్, ఆది, తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన విద్యార్థి